'ఈటలను ఓడించేందుకు సొంత పార్టీ

నేతలు ప్రయత్నించారు'



సంబురాల్లో పాల్గొన్న కేశవరెడ్డి, బీజేపీ శ్రేణులు

రసూల్‌పురా: మల్కాజ్‌గిరి ఎంపీగా బీజేపీ నుంచి పోటీ చేసిన ఈటల రాజేందర్‌ను ఓడించేందుకు ఆ పార్టీ నేతలే విశ్వప్రయత్నాలు చేశారని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు సదా కేశవరెడ్డి సంచలన వాఖ్యలు చేశారు. బుధవారం కంటోన్మెంట్ నియోజకవర్గం అన్నానగర్, రసూల్‌పురా కంగాల్ చౌరస్తాలో ఈటల రాంజేందర్ విజయం సాధించడంతో బీజేపీ శ్రేణులు సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సదా కేశవరెడ్డి మాట్లాడుతూ.. బీజేపీ పార్టీలోని ఓ బడానేత ఈటల విజయం సాధిస్తే తనకు అడ్డుగా ఉంటాడని భావించి మల్కాజ్‌గిరిలో ఎంపీగా ఈటల విజయం సాధించకుండా విశ్వప్రయత్నాలు చేశాడని పార్టీ నాయకులకు తగు సూచనలు చేశాడని కాని ఓటర్ల మద్దతుతో మోదీ చరిష్మాతో ఈటల రాజేందర్ భారీ మెజార్టీతో విజయం సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మాచర్ల శ్రీనివాస్, సామల సత్తిరెడ్డి, గంజి వంశి, రామాంజనేయులు, మహేష్, మణికంఠ, కిషన్, చిన్నం పాండు, నాగరాజు, ఫాతిమా, శ్రీమతి, కమలమ్మ, రేణుక, సుశీల, శ్యామల, లక్ష్మి, జ్యోతి, భాగ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ శ్రేణుల సంబరాలు



సంబరాలు చేసుకుంటున్న నాయకులు

చిలకలగూడ: సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి విజయం సాధించిన నేపథ్యంలో బీజేపీ నాయకులు మేకల హర్షకిరణ్, కీర్తిల నేతృత్వంలో శ్రీనివాసనగర్‌లో బుధవారం బాణాసంచా కాల్చి, మిఠాయిలు పంచి సంబరాలు చేసుకున్నారు. ప్రధాని నరేంద్రమోదీ, కిషన్‌రెడ్డి, ఈటల రాజేందర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మేకల సారంగపాణి మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా బీజేపీ హవా కొనసాగిందని, తెలంగాణలో ఎనిమిది ఎంపీ సీట్లు గెలుచుకుని కాషాయ జెండా ఎగురవేసామన్నారు.

ఊహకందని అంచనాలు..

అనూహ్య ఫలితాలు !

- రెండో స్థానంలో బీజేపీ, మూడో స్థానానికి పడిపోయిన బీఆర్ఎస్
- 12 రౌండ్లలో కాంగ్రెస్, 5 రౌండ్లలో బీజేపీ ముందంజ



రౌండ్ల వారీగా వచ్చిన ఓట్లు..

రౌండ్	కాంగ్రెస్	బీజేపీ	బీఆర్ఎస్	లీడ్
1.	3,995	2,666	3,140	855
2.	3,709	1,517	2,239	1470
3.	4,344	1,199	2,331	2013
4.	2,437	1,920	1,662	517
5.	3,655	1,858	2,367	1,288
6.	3,288	2,575	2,935	353
7.	2,996	2,977	2,087	19
8.	2,902	2,612	1,780	290
9.	2,450	2,787	1,558	337 (బీజేపీ)
10.	1,890	2,776	1,390	886 (బీజేపీ)
11.	3,657	2,711	1,991	946
12.	3,092	1,597	1,673	1,419
13.	3,359	1,736	1,546	1,623
14.	3,622	2,180	2,164	1,442 (బీజేపీ)
15.	2,962	3,363	1,955	401 (బీజేపీ)
16.	2,868	3,797	1,966	929 (బీజేపీ)
17.	2,048	1,970	1,437	78
పోస్టల్	377	204	241	136
మొత్తం	53,651	40,445	34,462	13,206

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎన్. శ్రీగణేశ్ ఎమ్మెల్యేగా విజయం సాధించారు. పరిశీలకుల అంచనాలను తారుమారు చేస్తూ కంటోన్మెంట్‌లో మరోసారి బీజేపీ రెండో స్థానంలో నిలిచింది. ఆరు నెలల క్రితం జరిగిన ఎన్నికల్లో 17 వేల పైచిలుకు ఓట్ల మెజారిటీతో గెలిచిన బీఆర్ఎస్ పార్టీ మూడో స్థానానికి పడిపోయింది. మంగళవారం ఉదయం కౌంటింగ్ ప్రారంభానికి ముందు వరకు నియోజకవర్గంలో మెజారిటీ నేతలు, కార్యకర్తలు పోటీ కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల మధ్యే ఉంటుందని భావించారు. పోస్టల్ బ్యాలెట్‌తో పాటు తొలి మూడు రౌండ్ల వరకు కాంగ్రెస్ మొదటి స్థానంలో, బీఆర్ఎస్ రెండో స్థానంలో ఉన్నాయి. నాలుగో రౌండ్‌లో బీజేపీ రెండోస్థానంలో నిలిచింది. మళ్లీ 5, 6 రౌండ్‌లో బీఆర్ఎస్, ఏడో రౌండ్‌లో మళ్లీ బీజేపీ రెండో స్థానంలోకి వచ్చాయి. ఇక 12వ రౌండ్‌లో రెండోస్థానం మినహా, అన్ని రౌండ్లలోనూ బీఆర్ఎస్ మూడో స్థానంలోనే ఉంటూ వచ్చింది. బీఆర్ఎస్ ఏ రౌండ్‌లోనూ ఆధిక్యం కనబరచలేదు. ఉన్నట్టుండి 9, 10, 14, 15, 16 రౌండ్‌లలో బీజేపీ కాంగ్రెస్‌ను దాటి ఒకటో స్థానంలోకి దూసుకెళ్లడం గమనార్హం. ఈ నేపథ్యంలో తుది ఫలితాల్లో బీజేపీ రెండోస్థానంలో నిలిచింది. బీఆర్ఎస్ కంటే బీజేపీకి 5,983 ఓట్లు అధికంగా పోలవడం గమనార్హం. గత ఎన్నికల్లో మూడోస్థానంలో నిలిచిన కాంగ్రెస్ ప్రస్తుత ఎన్నికల్లో విజయం సాధించగా, గతంలో గెలిచిన బీఆర్ఎస్ మూడో స్థానంలోకి పడిపోయింది.

పనిచేయని సెంటిమెంట్

కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి నివేదితకు సెంటిమెంట్ కలిసి రాలేదు. ఏడాది వ్యవధిలోనే తండ్రి సాయన్న, సోదరి లాస్య నందిత మృత్యువాత పడటంతో ఆ మేరకు సెంటిమెంట్ పనిచేస్తుందని బీఆర్ఎస్ నేతలు భావించారు. ఈ క్రమంలోనే బీఆర్ఎస్ టికెట్ ఆశించిన కార్పొరేషన్ మాజీ చైర్మన్‌లు గజ్జెల నాగేశ్, మన్నె క్రిశాంక్, డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్‌లను కాదని నివేదితకు టికెట్ కేటాయించారు. అయితే బీఆర్ఎస్ నుంచి ఆమెకు ఆశించిన మద్దతు లభించలేదు. బోర్డు మాజీ సభ్యుల మితిమీరిన జోక్యం సహించని పలువురు నేతలు ప్రచారంలో ఉండి ఉండనట్లు వ్యవహరించారు. పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ నేతలు పార్టీని వీడారు. పలువురు కీలక నేతలు ప్రచారానికి దూరంగా ఉన్నారు. ఇక లాస్య నందిత, నివేదితలపై డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపులో అవినీతి ఆరోపణలు వచ్చాయి. దివంగత నేత సాయన్న ఇమేజ్‌కు సరితూగేలా వ్యవహరించడం లేదని, కార్యకర్తలకు తగిన గుర్తింపు ఇవ్వడం లేదనే ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో సాయన్న ఇమేజ్ కలిసి రాలేదని తెలుస్తోంది.

పట్టు నిలుపుకున్న బీజేపీ

కంటోన్మెంట్‌లో బీజేపీ ఓటమి పాలైనప్పటికీ, గత ఎన్నికలతో పోలిస్తే స్వల్ప ఓట్లు కోల్పోయినప్పటికీ ద్వితీయ స్థానాన్ని నిలబెట్టుకుంది. నవంబర్‌లో బీజేపీకి 41,888 ఓట్లు పోలవగా, ఉప ఎన్నికల్లో 40,445 ఓట్లు సాధించింది. అయితే మల్కాజ్‌గిరి పార్లమెంట్‌కు సంబంధించి ఇదే నియోజకవర్గం నుంచి ఆ పార్టీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు ఏకంగా 64,133 ఓట్లు వచ్చాయి. అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ టీఎన్ వంశ తిలక్ సాధించిన ఓట్ల కన్నా 23,668 ఎక్కువ ఓట్లు పోలవ్వడం గమనార్హం.



మంత్రి పొంగులేటిని కలిసిన ఎమ్మెల్యే శ్రీగణేశ్

ఎమ్మెల్యేకు అభినందనల వెల్లువ



శ్రీగణేశ్‌కు అభినందనలు తెలుపుతున్న నేతలు

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్ అభ్యర్థి శ్రీగణేశ్‌కు అభినందన వెల్లువ కొనసాగుతోంది. నియోజకవర్గ వ్యాప్తంగా కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో ఎమ్మెల్యే శ్రీగణేశ్‌ను కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్నారు. కార్యకర్తల సమష్టి కృషితోనే తన గెలుపు సాధ్యమైందని శ్రీగణేశ్ పేర్కొన్నారు. త్వరలోనే నియోజకవర్గ స్థాయి కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. తన గెలుపు కోసం సంపూర్ణ సహకారం అందించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మైనంపల్లి హన్మంతరావు సహా ఇతర ముఖ్య నేతలను కలిసి శ్రీగణేశ్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

ఈటలకు శుభాకాంక్షలు



బౌద్ధనగర్: మల్కాజ్‌గిరి పార్లమెంట్ నుంచి భారీ మెజారిటీతో విజయం సాధించిన ఈటల రాజేందర్‌ను బౌద్ధనగర్‌కు చెందిన బీజేపీ నేతలు మేకల కీర్తి, హర్షకిరణ్ కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా జన్మదిన వేడుకలు



గడ్డం ప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

బౌద్ధనగర్: తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కుమార్ జన్మదినాన్ని పురస్కరించుకొని దళిత సంఘర్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు నీరుడు కృష్ణ నేతృత్వంలో ఆయనను సమితి సభ్యులు కలిసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ.. దళిత సామాజిక వర్గానికి చెందిన గడ్డం ప్రసాద్ వార్డ్ మెంబర్ స్థాయి నుంచి ఎంపీపీ, ఎమ్మెల్యే పదవులు చేపట్టి ప్రస్తుతం తెలంగాణ అసెంబ్లీ స్పీకర్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ ఎంతోమందికి ఆదర్శంగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు రమేష్, రజాక్, సతీష్, ప్రసాద్, కనకయ్య, అంజయ్య, గౌస్, ఇస్మాయిల్, రంజాన్, బింగి లక్ష్మి పాల్గొన్నారు.

సికింద్రాబాద్ అభివృద్ధికి పాటుపడాలి

లాలాపేట: సార్వత్రిక ఎన్నికల్లో సికింద్రాబాద్ పార్లమెంట్ నుంచి కిషన్‌రెడ్డి ఘన విజయం సాధించడంపై తార్నాక వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు డా. పి. మోహన్‌రావు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తార్నాకలోని కాలనీలు, అపార్టుమెంట్ వాసుల సమస్యలపై దృష్టి సారించడంతో పాటు సికింద్రాబాద్ పార్లమెంట్ అభివృద్ధికి పాటు పడాలని కోరారు.

పెట్రోల్ దొంగలకు రిమాండ్



శ్రీకాంత్



విక్రమ్

అడ్డగుట్ట: అర్ధరాత్రుల సమయాల్లో బైక్‌లలో నుంచి పెట్రోల్ దొంగిలిస్తున్న ఇద్దరు యువకులను రిమాండ్‌కు తరలించిన ఘటన పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రమేష్ గౌడ్ వివరాల ప్రకారం..ఉప్పల్ ప్రాంతానికి చెందిన శ్రీకాంత్(20), విక్రమ్(20) స్నేహితులు. ఈ నెల 2న అర్ధరాత్రి లాలాపేటలోని ఇందిరనగర్ కాలనీలోని ద్విచక్ర వాహనాల్లో పెట్రోల్ దొంగిలిస్తున్నారు. ఈ క్రమంలో అదే ప్రాంతంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకుని బుధవారం కోర్టులో హాజరు పరచగా రెండ్రోజుల జైలుశిక్ష విధించినట్లు తెలిపారు.

ఎన్నికల ఉల్లంఘనులపై కేసుల నమోదు

బంజారాహిల్స్: ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి బాణసంచా కాల్చడంతోపాటు ర్యాలీలు నిర్వహించిన వారిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-2లోని టీడీపీ కార్యాలయం ముందు హంగామా చేసిన ఐదుగురిపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలివీ... మోతీనగర్‌కు చెందిన రావుల సురేందర్(38), కూకట్‌పల్లి వీవీనగర్‌కు చెందిన మామిడిపల్లి రఘు(39), అమీర్‌పేటకు చెందిన బత్తుల శశాంక్(36), జూబ్లీహిల్స్ హౌసింగ్ సొసైటీకి చెందిన కిరణ్‌చౌదరి(36), జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-2కు చెందిన వికాస్ (39)లు గ్రూపుగా ఏర్పడి ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా బాణసంచా కాల్చడంతో వారిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

◆ కూకట్‌పల్లికి చెందిన మహేష్(30), మియాపూర్‌కు చెందిన వెంకటకృష్ణారెడ్డిలు కారులో వచ్చి బీఆర్ఎస్ కార్యాలయం ముందు టీడీపీ జెండాలు ప్రదర్శిస్తూ హంగామా చేయడంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. వారికి ఆల్కాహాల్ టెస్ట్ నిర్వహించగా మద్యం సేవించినట్లు నిర్ధారణ అయ్యింది. ఈ మేరకు ఇరువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

◆ జూబ్లీహిల్స్ నుంచి టీడీపీ కార్యాలయం వైపు బైక్‌లు, కార్లతో ర్యాలీగా వెళ్తున్న కాకర్ల వినీత్, సాయికుమార్ తదితరులపై పోలీసులు కేసు నమోదు చేశారు.

కాంగ్రెస్, బీజేపీ నాయకులపై ..

రహమత్‌నగర్: ఎన్నికల కోడ్ నేపథ్యంలో నిబంధనలను ఉల్లంఘించిన నాయకులపై బోరబండ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... రహమత్‌నగర్ కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకుని శ్రీరాంనగర్ సెంటర్‌లో సోమవారం ఆయన అనుచరులు టెంట్ వేసి, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించారు. ఆ సమయంలో విధి నిర్వహణలో ఉన్న గస్తీ పోలీసులు కార్పొరేటర్ సీఎన్ రెడ్డి అతని అనుచరులపై కేసు నమోదు చేశారు. అలాగే సికింద్రాబాద్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విజయోత్సవ సంబరాలు జరుపుకొన్న బీజేపీ నాయకులపై కూడా బోరబండ కేసు నమోదు చేశారు. ఎన్నికల కోడ్ ఉల్లఘించి, బాణసంచా కాల్చి, నినాదాలు చేసిన ఆ పార్టీ నేతలు వెంకటేశ్, రాజు, శరణ్‌రెడ్డి, నారాయణ తదితరులపై కేసులు నమోదు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు వివరించారు.

చేతి వృత్తులను ప్రోత్సహించాలి

కవాడిగూడ: చేతివృత్తులను ప్రోత్సహించి వాటిపై ఆధారపడి జీవనోపాధిని పొందుతున్న చేనేత వృత్తి కళాకారులను ఆదుకోవాలని అభ్యుదయ గ్రామీణ డ్వాక్రా రాష్ట్ర కమిటీ అధ్యక్షురాలు కోటా దేవకీ దేవి కోరారు. బుధవారం ఆమె ఎన్టీఆర్ స్టేడియంలో ఏప్రిల్ 13న ఏర్పాటు చేసిన జాతీయ చేనేత సిల్క్ ఎక్స్‌పో ఎగ్జిబిషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ... చేనేత ఎగ్జిబిషన్‌కు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందన్నారు. ఈ ఎగ్జిబిషన్ ఈ నెల 9 వరకు కొనసాగుతుందని తెలిపారు. ఈ ప్రదర్శనలో ప్రత్యేకంగా గద్వాల్ చీరలు, ఉప్పాడపట్టు, వెంకటగిరి పట్టు, పోచంపల్లి పట్టుచీరలు, కాటన్, కళంకారీ, మాధవరం, ప్యూర్ సిల్క్ , ఛందేరీ కాటన్, గుజరాత్ త్రేడ్‌వర్క్, ప్రొద్దుటూరు కాటన్, మంగళగిరి, భాగల్‌పూర్ చీరలు, లక్నో నైటీస్, బెంగాలీ కాటన్, కశ్మీర్ శారీస్, ఖాదీ షెట్స్, లక్నో టాప్స్, వెస్టన్ టాప్స్, కిడ్స్ వేర్ అందుబాటులో ఉన్నాయని ఆమె వివరించారు. వీటితో పాటు వివిధ రకాల క్రాఫ్ట్ ఐటమ్స్ కొండపల్లి బొమ్మలు, పూసలతో తయారు చేసిన జివెలరీ, గాజులు, పిండివంటలతో కూడిన 150 స్టాల్స్ ఏర్పాటు చేసినట్లు ఆమె పేర్కొన్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు



సనత్‌నగర్: టమాటా రూ.47, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 38, పచ్చిమిర్చి 60, బజ్జీమిర్చి 55, క్యాప్సికమ్ 65, పచ్చకాకర 38, పందిరి బీర 35, క్యాబేజీ 21, క్యారెట్ 40, దొండ 18, గుండుబీన్స్ 115, గింజ బీక్కుడు 65, గోకరకాయ 45, కీర 28, దోసకాయ 28, రూట్ రూట్ 23, ఉల్లిగడ్డ 28, ఆలుగడ్డ 33, చామగడ్డ 40, మొరంగడ్డ 31, కందగడ్డ 45, సొరకాయ 11, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 3-4, ముల్లంగి 4-5. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

కాంగ్రెస్ పార్టీ ఏఐసీసీ సభ్యులు కఠారి గౌరిశంకర్, గ్రేటర్ హైదరాబాద్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు మహేష్‌తో కలిసి బుధవారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి పార్లమెంటు ఎన్నికల్లో అధిక సీట్లు సాధించడం పట్ల శుభాకాంక్షలు తెలిపారు. –రాంగోపాల్‌పేట్



నిర్మాణ సామగ్రి.. క్రీడలకు ఇబ్బంది





తార్నాక డివిజన్ లాలాపేటలోని ప్రొ. జయశంకర్ స్టేడియంలో గత కొన్ని సంవత్సరాల నుంచి భవన నిర్మాణ సామగ్రిని విచ్చలవిడిగా పడేశారు. స్టేడియం ఆవరణలో మూడేళ్ల క్రితం జాతీయస్థాయి ప్రమాణాలతో స్విమ్మింగ్ పూల్ నిర్మాణం చేపట్టారు. నిర్మాణ పనులు ఓ అడుగు ముందుకు రెండడుగులు వెనక్కి అన్నచందంగా సాగుతున్నాయి. దీని కోసం ఇసుక, కంకర, ఐరన్, తదితర నిర్మాణ సామగ్రిని తీసుకొచ్చి స్టేడియంలో ఇష్టానుసారంగా వేశారు. ఏళ్ల తరబడి ఇలా స్టేడియంలో నిర్మాణ సామగ్రి పడి ఉండటంతో క్రీడాకారులు, వాకర్స్‌కు ఇబ్బందిగా మారింది. ఈ సామగ్రితో అప్పుడప్పుడు ప్రమాదాల బారిన పడుతున్నామని క్రీడాకారులు వాపోతున్నారు. –లాలాపేట

నేడు బీసీ కుల సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం

కవాడిగూడ: కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం తక్షణమే ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేసి కులగణన బిల్లు పెట్టి దానికి చట్టబద్ధత కల్పించాలని బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు డి.రాజారాంయాదవ్ కోరారు. ఈ మేరకు బీసీ కులసంఘాలతో గురువారం ఖైరతాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఉదయం 11 గంటలకు జరిగే ఈ రౌండ్‌టేబుల్ సమావేశానికి రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య, రాజ్యసభ మాజీ సభ్యుడు బండ ప్రకాష్ ముదిరాజ్, బీఆర్ఎస్ నేత, నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్, కవి, రచయిత, తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్ తదితర ప్రముఖులు పాల్గొంటారన్నారు. సమావేశానికి మేధావులు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు అవుదాం

బేగంపేట టీటీఐ ఏసీపీ శంకర్‌రాజు

సనత్‌నగర్: పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు అవుదామని బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) ఏసీపీ శంకర్‌రాజు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బేగంపేట ట్రాఫిక్ పోలీసు సిబ్బంది, వారి పిల్లలకు బుధవారం హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శంకర్‌రాజు మాట్లాడుతూ.. పర్యావరణ వ్యవస్థ పునరుద్ధరణ కోసం ప్లాస్టిక్, వాయు కాలుష్యాన్ని తగ్గించాలన్నారు. ప్రకృతిని ప్రజలకు కనెక్ట్ చేయడం, చెట్లు నాటి గ్రీన్ ఎకానమీ పెంచాల్సిన ఆవశ్యకత ఉందన్నారు.

ప్రకృతిని కాపాడుకుందాం.



మొక్కలు నాటుతున్న జలందర్‌గౌడ్

అమీర్‌పేట: ప్రకృతిని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆస్టర్ ప్రైమ్ ఆసుపత్రి సీఈఓ దేవానంద్ అన్నారు.ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అమీర్‌పేట ఆస్టర్ ప్రైమ్ ఆసుపత్రి ఆధ్వర్యంలో బుధవారం హుడా, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి కేఎల్ఎన్‌వై పార్కులో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నానాటికి పెరిగిపోతున్న కాలుష్యాన్ని తగ్గించాలంటే మొక్కలను పెంచడమే సరైన మార్గమన్నారు. నాటిన మొక్కలను సరైన రీతిలో సంరక్షించుకోవాల్సిన అవసరం ఉందని, నాటిన మొక్కలు వృక్షాలుగా మారి ఫలాలను అందించేస్థాయికి ఎదుగుతాయని చెప్పారు. ఈ విషయంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు చేస్తున్న కృషిని అభినందిస్తూ భవిష్యత్తులో వారు చేస్తున్న పనులకు ఆసుపత్రి ద్వారా సహయ సహకారాలు అందిస్తామన్నారు. అనంతరం మొక్కల ప్రాధాన్యతను చాటి చెపుతూ పార్కు పరిసరాల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ చైర్మన్ షాబాద్ శ్రీనివాస్‌రావు, అధ్యక్షులు రమేష్‌గౌడ్, ఆసుపత్రి రీజినల్ సీఈఓ రవికుమార్ పాల్గొన్నారు.



వాకర్స్‌తో కలిసి ర్యాలీ నిర్వహించిన ఆసుపత్రి సిబ్బంది

మక్తల ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

రాంగోపాల్‌పేట్: పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని మక్తల ఫౌండేషన్ చైర్మన్ జలందర్‌గౌడ్ అన్నారు. అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బుధవారం ఫౌండేషన్ సభ్యులతో కలిసి ఆయన సోమసుందరం వీధిలో మొక్కలు నాటారు. రాబోయే తరాలకు ఆరోగ్యకరమైన జీవితాన్ని అందించాలంటే మొక్కలు పెంచడం బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. పర్యావరణాన్ని కాపాడటం కోసం కాలుష్య కారకాలను తగ్గించాలని, కార్లు, ద్విచక్ర వాహనాలకు బదులుగా సైకిళ్లు, విద్యుత్ వాహనాలు వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు వేణు, సుబ్రహ్మణ్యం, మహేష్, వేణు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వేగం కన్నా ప్రాణం ముఖ్యం

సనత్‌నగర్: వేగం కన్నా ప్రాణం ఎంతో ముఖ్యమని బేగంపేట టీటీఐ ఏసీపీ శంకర్‌రాజు పిలుపునిచ్చారు. బల్కంపేట చెన్నైస్ అమిత్ర ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థులకు 'రోడ్డు ప్రమాదాలు-నివారణ' అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శంకర్‌రాజు మాట్లాడుతూ.. రాంగ్ సైడ్ డ్రైవింగ్ చేసినందుకు నగరంలో 2023లో 5,23,382 మందిపై కేసులు నమోదయ్యాయన్నారు. 2022తో పోలిస్తే ఈ సంఖ్య 86 శాతం పెరిగిందన్నారు. యూటర్న్స్ దూరంగా ఉన్నాయని.. సిగ్నల్ దగ్గర సమయం వృథా అని భావిస్తూ రాంగరూట్‌లో డ్రైవింగ్ చేస్తూ ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. నగరంలో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్‌కు ప్రత్యామ్నాయంగా పోలీసులు వన్‌వేలు, యూటర్న్ లాంటి మార్గాలను ఏర్పాటు చేస్తున్నా కొంతమంది ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చంద్రమోహన్, వైస్ ప్రిన్సిపాల్ నాగలక్ష్మీ, అయాన్, పీసీ శ్రీకృష్ణ, శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.



ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పిస్తున్న టీటీఐ ఏసీపీ శంకర్‌రాజు